క్లుప్తంగా

నల్లజర్ల ఎస్‌ఐగా శ్రీహరిబాబు



నల్లజర్ల: స్థానిక పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా జి. శ్రీహరిబాబు ఆదివారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఇంత వరకూ ఇక్కడ ఎస్సైగా పని చేసిన వెంకట సురేష్ నర్సాపురం రూరల్ ఎస్సైగా బదిలీపై వెళ్లారు. కాగా శ్రీహరిబాబు విజయవాడలో రైల్వే శాఖలో ఎస్‌ఐగా పనిచేస్తూ వీఆర్‌కు వెళ్లారు. అక్కడి నుంచి నల్లజర్ల ఎస్‌ఐగా నియమితులయ్యారు.

నేటి నుంచి సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ

నల్లజర్ల: ఈనెల 18 నుంచి 21 వరకూ మండలంలోని గ్రామ పంచాయతి సర్పంచులకు, గ్రేడ్-1, గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సింహాద్రి తెలిపారు. గ్రామపరిపాలన, పారిశుద్యం, పంచాయతీల అభివృద్ధి, చెత్త నుంచి సంపద తయారీ తదితర అంశాలపై వారికి శిక్షణ ఉంటుందన్నారు.

నేడు అమ్మవారికి లక్ష గాజుల పూజ

తాళ్లపూడి: శ్రావణ పౌర్ణమ సందర్భంగా సోమవారం స్థానిక నవ దుర్గాది పరివార సహిత కనకదుర్గమ్మ ఆలయంలో లక్ష గాజులతో పూజా మహోత్సవం నిర్వహిస్తున్నట్టు అర్చకుడు శివప్రసాద్ ఆదివారం తెలిపారు. ఉదయం నుంచి ఆలయం వద్ద సామూహిక కుంకుమ పూజలు నిర్వహిస్తామని, మహిళలు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

కిడ్నీ బాధితుడికి మానవత ఆర్థిక సాయం



వైద్య ఖర్చుల నిమిత్తం వెంకట్రాజుకు ఆర్థిక సాయం చేస్తున్న మానవత సంస్థ ప్రతినిధులు

తాళ్లపూడి: రెండు కిడ్నీలూ పాడవడంతో మండలంలోని అన్నదేవరపేట గ్రామానికి చెందిన కొలారి వెంకట్రాజు డయాలసిస్ చేయించుకుంటున్నాడు. ఈ క్రమంలో ఆయన వైద్య ఖర్చులకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ ప్రతినిధులు ఆదివారం వెంకట్రాజు ఇంటికి వెళ్లి అతడి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.6 వేల ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో మానవత సంస్థ అధ్యక్షుడు అంకెం సురేష్, ఉపాధ్యక్షుడు తిరిగిపల్లి దోసాలు, సభ్యులు సనపల రాజశేఖర్, ఎ.హనుమంతరావు, పెమ్మాడి దుర్గాప్రసాద్, గెడ్డం సాయిబాబా, కవల రామాంజనేయులు, ఇంజరపు సత్యనారాయణ, గుప్త పాల్గొన్నారు.

గణపతి ఉత్సవాలకు రాట ముహూర్తం



గణపతి నవరాత్ర ఉత్సవాలకు రాట ముహూర్తం చేస్తున్న చాగల్లు తెలగా సంఘ సభ్యులు

చాగల్లు: తెలగా సంఘం ఆధ్వర్యంలో చాగల్లులో ఈ ఏడాది గణపతి నవరాత్ర ఉత్సవాల నిర్వహణకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్టు ఉత్సవ కమిటీ నిర్వాహకుడు, మాజీ సర్పంచ్ గంద్రోతు సురేంద్రకుమార్ తెలిపారు. ఉత్సవాలకు స్థానిక విఘ్నేశ్వర ఆలయం వద్ద ఆదివారం రాట ముహూర్తం చేశారు. సెప్టెంబర్ 7 నుంచి ప్రారంభమయ్యే ఈ ఉత్సవాల్లో సినీ, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. రాట ముహూర్తంలో వైఎస్సార్ సీపీ మండల గౌరవాధ్యక్షుడు జుట్టా కొండలరావు, కమిటీ సభ్యులు దాసరి కృష్ణ, పిండి మంగరాజు, అనిశెట్టి సూర్యం తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం గ్రామదేవతలకు కిరీట ధారణ



గ్రామదేవతలు నక్కిర్లమ్మ, సోమాలమ్మలకు మంగళసూత్రధారణ, కిరీటాలు ఏర్పాటు చేసిన భక్తులు

గోపాలపురం: స్థానిక గ్రామదేవతలు నక్కిర్లమ్మ, సోమాలమ్మ వార్లకు ఆదివారం మంగళ సూత్ర ధారణ చేసి, కిరీటాలు ఏర్పాటు చేశారు. స్థానిక షిర్డీ సాయి ఆలయం వద్ద నుంచి గంగానమ్మ గుడి వరకూ బాజా భజంత్రీలు, డప్పు వాయిద్యాలతో ఉదయం 9 గంటల నుంచి అమ్మవార్లను ఊరేగించారు. అనంతరం గ్రామ దేవతల ఆలయంలో అమ్మవార్లకు బంగారు మంగళ సూత్రధారణ అనంతరం, వెండి కిరీటాలు అమర్చారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవార్ల ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయం వద్ద భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. గ్రామంలోని భక్తులతో పాటు వివిధ గ్రామాల్లో ఉన్న తోబుట్టువులకు సంప్రదాయబద్ధంగా చీరసారెలు అందజేశారు.

కొవ్వూరులో దాహం.. దాహం

- శివారు కాలనీలకు అందని తాగునీరు
- ట్యాంకర్లతో అరకొరగా సరఫరా
- పైప్‌లైన్ల మరమ్మతుల్లో తగని నిర్లక్ష్యం
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపణలు
- మునిసిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరిక



కొవ్వూరు మెయిన్ రోడ్డులో పైప్‌లైన్ మరమ్మతుల కోసం తవ్విన గొయ్యి నుంచి పొంగి పొర్లుతున్న తాగునీరు



కొవ్వూరు రాజీవ్ కాలనీలో నీళ్లు రాని కుళాయి వద్ద నిరసన తెలుపుతున్న స్థానికులు

కొవ్వూరు: జీవనది గోదావరి చెంతనే ప్రవహిస్తున్నా కొవ్వూరులో గొంతెండుతోంది. పట్టణంలోని అనేక శివారు ప్రాంతాలకు సక్రమంగా తాగునీరు అందడం లేదు. స్థానిక బ్రిడ్జిపేట, రాజీవ్, ఇందిరమ్మ, యానాద కాలనీల వాసులు తాగునీటి సమస్య ఎదుర్కొంటున్నారు. పెరుగుతున్న జనాభా అవసరాల మేరకు తాగునీరు సరఫరా కావడం లేదు. పట్టణంలో 12,982 కుటుంబాలు, 39,706 మంది జనాభా ఉన్నారు. ఒక్కో వ్యక్తికి రోజుకు 135 లీటర్ల తాగునీటిని అందించాల్సి ఉండగా ప్రస్తుతం కేవలం 110 లీటర్ల చొప్పున మాత్రమే సరఫరా చేస్తున్నారు. పది బోర్లు, రెండు అండర్‌గ్రౌండ్ సంప్‌లు, నాలుగు ఓవర్ హెడ్ ట్యాంకుల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. పట్టణవ్యాప్తంగా 40.92 కిలోమీటర్ల మేర తాగునీటి పైప్‌లైన్లు విస్తరించి ఉన్నాయి. బ్రిడ్జిపేట, రాజీవ్, వాంబే కాలనీలకు మాత్రం ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. రాజీవ్ కాలనీలో ఒక పూట నీళ్లు వస్తే రెండో రోజు రావడం లేదని వాపోతున్నారు. అర్ధరాత్రి రెండు గంటలకు ట్యాంకర్‌ను పంపిస్తున్నారని ఆ సమయంలో ఏవిధంగా నీళ్లు పట్టుకుంటామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కౌన్సిల్ సమావేశంలోనూ పలుమార్లు సభ్యులు తాగునీటి సమస్యపై గళం విప్పినా ప్రయోజనం ఉండడం లేదు. పట్టణ శివారు జగనన్న కాలనీ వాసులకు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాలని కౌన్సిల్ సభ్యులు సూచించినప్పటికీ పూర్తిస్థాయిలో ఆచరణకు నోచుకోవడం లేదు. నెల రోజులుగా అనేక వార్డుల్లో పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా కావడం లేదు. కొన్నిచోట్ల కుళాయిల నుంచి తాగునీరు కలుషితంగా వస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించుకుంటే మునిసిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామంటూ హెచ్చరిస్తున్నారు. తాగునీటి కలుషితంపై కొవ్వూరు సబ్ కలెక్టర్ స్వయంగా పలుమార్లు మున్సిపల్ కమిషనర్‌తో స్వయంగా ఫోన్‌లో మాట్లాడినా చర్యలు మాత్రం శూన్యం.

ఏఈ పర్యవేక్షిస్తున్నారు

పట్టణంలో తాగునీటి సమస్యపై మున్సిపల్ కమిషనర్ కె.డానియేల్ జోసెఫ్‌ను వివరణ కోరగా పైప్‌లైన్ మరమ్మతులను ఏఈలు పర్యవేక్షిస్తున్నారని బదులిచ్చారు. పూర్తి వివరాలు తనకు తెలియదన్నారు.ట్యాంకర్ల ద్వారా ఏయే ప్రాంతాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారని ప్రశ్నించగా ఏఈలను అడిగి చెబుతానని సమాధానం చెప్పారు.

ముగ్గురు ఏఈలున్నా..

గతంలో ఎన్నడూ లేని విధంగా కొవ్వూరు మున్సిపాలిటీలో ముగ్గురు ఏఈలు పని చేస్తున్నారు. ఒక్కొక్కరు ఏడు లేదా ఎనిమిది వార్డుల చొప్పున బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. గతంలో ఒకే ఏఈ పని చేసినపుడు కూడా ఈ స్థాయిలో తాగునీటి సమస్య లేదు. పట్టణంలో తాగునీటి సరఫరాను పూర్తిగా ఒక ఏఈ పర్యవేక్షిస్తున్నారు. పనులను మరో ఏఈ చూస్తునారు. అయినప్పటికీ తాగునీటి సమస్యలు పరిష్కారం కావడం లేదనే విమర్శలు వస్తున్నాయి.పైప్‌లైన్ల మరమ్మతులు పూర్తి చేయడంలో శ్రద్ధ చూపడం లేదు. మునిసిపల్ కమిషనర్ కనీసం క్షేత్ర స్థాయిలో పర్యటించక పోవడం విమర్శలకు తావిస్తోంది.

అస్తవ్యస్తంగా పైప్‌లైన్లు

పట్టణంలో తాగునీటి పైప్‌లైన్ల వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. మొత్తం 29 చోట్ల లీకేజీలు ఉన్నట్టు గుర్తించామని అధికారులు చెబుతున్నారు. వాటిలో కొన్నింటికి మరమ్మతులు చేసినప్పటికీ పూర్తిస్థాయిలో పనులు పూర్తి కాలేదు. దాంతో అనేక ప్రాంతాల్లో నెల రోజులుగా తాగునీరు కలుషితంగా వస్తోంది. తాగునీటి పైప్‌లైన్ల మరమ్మతుల్లో నిర్లక్ష్యం పేరుతో ఇటీవల ‘సాక్షి’లో కథనం రావడంతో మెయిన్‌రోడ్డులోని పంచాయతీరాజ్ గెస్ట్‌హౌస్ వద్ద గల పైప్‌లైన్ గోతిని అధికారులు పూడ్చి వేయించారు. మళ్లీ అదే రోజు లీకేజీ ఏర్పడడంతో మళ్లీ గొయ్యి తవ్వించారు. ఈ గోతిలో తాగునీరు పొంగి రోడ్డుపై ప్రవహిస్తోంది. వేగివారి చావిడి ప్రాంతంలో రోడ్డుపై తవ్విన పైప్‌లైన్ గొయ్యిదీ ఇదే పరిస్థితి.

పది రోజులుగా అష్టకష్టాలు



తాగునీటి పైప్‌లైన్ మరమ్మతుల్లో భాగంగా నెల క్రితం మా ప్రాంతంలో గొయ్యి తవ్వారు. ఇంత వరకూ మరమ్మతులు పూర్తి చేయలేదు. వారం, పది రోజులుగా మా ప్రాంతంలో తాగునీరు సరఫరా కావడం లేదు. సమీపంలోని ఇళ్ల వద్దకు వెళ్లి తాగునీటిని తెచ్చుకుంటున్నాం.

–అనపర్తి జయలక్ష్మి, 20వ వార్డు, కొవ్వూరు

పట్టించుకున్న నాథులే లేరు



తాగునీటి కోసం నిత్యం అవస్థలు తప్పడం లేదు. పైప్‌లైన్ మరమ్మతుల పేరుతో తవ్వి వదిలేశారు. డ్రైనేజీ మురుగు నీరంతా మళ్లీ పైప్‌లైన్‌లోకి వెళుతోంది. కుళాయిల నుంచి రెండు బిందెల నీళ్లు రావడం కూడా గగనం అవుతోంది. తాగునీటి కోసం అవస్థలు పడుతున్నా ప్రజాప్రతినిధులుగాని, అధికారులు పట్టించుకోవడం లేదు. పక్క వీధుల్లోకి వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నాం.

–రుత్తల పద్మ, గృహిణి, కొవ్వూరు

మునిసిపల్ ఆఫీసు ముట్టడిస్తాం



తాగునీటి సమస్యను తక్షణం పరిష్కరించకపోతే మునిసిపల్ ఆఫీసును ముట్టడిస్తాం. కాయకష్టం చేసుకుని బతికే జనం గుక్కెడు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. బ్రిడ్జిపేట, రాజీవ్, వాంబే, యానాద, ఇందిరమ్మ కాలనీల్లో నీటి ఇబ్బందులు తీవ్రంగా ఉన్నాయి. పైప్‌లైన్ మరమ్మతులపై దృష్టి పెట్టడం లేదు. తాగునీరు కలుషితం అవుతున్నా అధికారులది అదే నిర్లక్ష్యం.

–పిక్కి నాగేంద్ర, బీజేపీ రాష్ట్ర కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు

పైప్‌లైన్‌పైనే మురుగు డ్రైన్ నిర్మాణం



కొత్తపల్లి అగ్రహారంలో తాగునీటి పైప్‌లైన్‌పై నిర్మిస్తున్న డ్రైన్



కొత్తపల్లి అగ్రహారంలో డ్రైన్ గోడలో ఉన్న వాటర్ పైప్‌లైన్

పెరవలి: ముందు చూపు లేకుండా ప్రజాధనంతో చేపట్టే పనులకు ఇదొక ఉదాహరణ. పూర్వం నుంచీ ఉన్న తాగునీటి పైప్‌లైన్ పై నుంచే మురుగునీటి డ్రైన్ నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం ఈ పనులు మండలంలోని కొత్తపల్లి అగ్రహారం పంచాయతీ పరిధిలో జరుగుతున్నాయి. రూ.3 లక్షల పంచాయతీ నిధులతో గ్రామంలోని బండారు సాయిబాబా ఇంటి వద్ద నుంచి కేతా నాగేశ్వరరావు ఇంటి వరకూ డ్రైన్ నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం ఈ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ డ్రైన్ నిర్మిస్తున్న ప్రాంతంలోనే తాగునీటి కోసం ఏర్పాటు చేసిన పైప్‌లైన్ ఉంది. దీనిపైనే డ్రైన్ నిర్మిస్తుండడంపై గ్రామస్తులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇలా ఒకదాని కింద ఒకటి ఏర్పాటు చేస్తే ఏదైనా అవాంతరం ఏర్పడినపుడు రెండు నిర్మాణాలూ పగలగొట్ట వలసి ఉంటుందంటూ గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ స్థానిక ప్రజా ప్రతిప్రతినిధి మాట కాదనలేక అధికారులు పనులను కానిచ్చేస్తున్నారు.

కోల్‌కతా ఘటనపై కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ



నిడదవోలు పట్టణంలో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన

నిడదవోలు: కోల్‌కతాలో యువ పీజీ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం ఘటనను నిరసిస్తూ పట్టణంలో ఆదివారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. సీఐటీయూ, ఏపీ ఎన్‌హెచ్‌ఎం జేఏసీ, కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. స్థానిక గణపతి సెంటర్, ప్రభుత్వాసుపత్రి, ఓవర్ బ్రిడ్జి సెంటర్, గణేష్ చౌక్ సెంటర్ల మీదుగా కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్ల యూనియన్ గౌరవాధ్యక్షుడు జువ్వల రాంబాబు, ఏపీఎన్ హెచ్ఎం చైర్మన్ దయామణి మాట్లాడుతూ ప్రజలకు వైద్య సేవలు అందించే మహిళా వైద్యులకు దేశంలో రక్షణ లేకుండా పోతోందన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేసేంత వరకూ, దేశంలోని మహిళా వైద్యులకు రక్షణ కల్పించేంత వరకూ పోరాటాన్ని కొనసాగిస్తామని ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. సెంట్రల్ ప్రొటెక్షన్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. హంతకులను కఠినంగా శిక్షించాలని కోరారు. డ్వాక్రా ఆర్పీలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేటి సాయంత్రం గోపాలపురంలో..

గోపాలపురం: కోల్‌కతాలో వైద్య విద్యార్థిని హత్యకు నిరసనగా సోమవారం సాయంత్రం ఆరు గంటలకు గోపాలపురంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తామని యుటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు జి.వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గోపాలపురం చెక్‌పోస్టు సెంటర్ వద్ద జరిగే ర్యాలీకి మండలంలోని ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు, అంగన్‌వాడీ, ఆశా, సీఐటీయూ ప్రజాసంఘాల సభ్యులు హాజరు కావాలని వెంకటేశ్వరరావు కోరారు.

మార్కెట్‌లో రాఖీల కొనుగోలు సందడి



మార్కెట్‌లో రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు

నిడదవోలు: అన్నాచెల్లెళ్ల అనురాగానికి, ఆప్యాయతలకు ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి సోమవారం .రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని గణపతి సెంటర్, గాంధీబొమ్మ సెంటర్, గణేష్ చౌక్ సెంటర్లలో రాఖీల విక్రయాలు జోరుగా సాగాయి. మహిళలు, విద్యార్థినులు మార్కెట్‌కు తరలి వచ్చి రాఖీలు కొనుగోలు చేశారు. రూ.25 నుంచి రూ.200 ఖరీదైన రాఖీలు మహిళలు తమ సోదరుల కోసం కొనుగోలు చేశారు. సోమవారం రాఖీ సందర్భంగా పట్టణంలోని వివిధ ఆలయాల్లో పూజల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

వ్యాయామోపాధ్యాయుల సంఘ కార్యవర్గం ఎన్నిక



పురుషోత్తపల్లిలో జరిగిన సమావేశంలో ఎన్నికైన వ్యాయామోపాధ్యాయుల సంఘ నూతన కార్యవర్గం

నిడదవోలు రూరల్: విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దడంలో వ్యాయామోపాధ్యాయుల పాత్ర కీలకం అని వ్యాయామోపాధ్యాయుల సంఘం గౌరవాధ్యక్షుడు పాలేటి శ్రీనివాస్ అన్నారు. నిడదవోలు జోన్ వ్యాయామోపాధ్యాయుల సంఘ నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం పురుషోత్తపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ఏకగ్రీవంగా జరిగింది. నూతన చైర్మన్‌గా ఎస్‌వీ సత్యనారాయణ (జెడ్పీ హైస్కూల్, సూర్యారావుపాలెం), గౌరవాధ్యక్షుడిగా పాలేటి శ్రీనివాస్ (జెడ్పీ హైస్కూల్, శెట్టిపేట), అధ్యక్షుడిగా పుల్లపు రాజు (జెడ్పీ హైస్కూల్ ఖండవల్లి), ఉపాధ్యక్షుడిగా ఎస్‌డీఎస్ జేమ్స్ (జెడ్పీ హైస్కూల్, కానూరు), ప్రధాన కార్యదర్శిగా బండి ప్రదీప్ (జెడ్పీ హైస్కూల్, తాడిమళ్ల), సంయుక్త కార్యదర్శిగా కె.గంగాధర్(జెడ్పీ హైస్కూల్, ముక్కామల), కోశాధికారిగా ఎం.వీరలక్ష్మి (డీఎస్‌ఓ మున్సిపల్ హైస్కూల్, నిడదవోలు), మహిళా ప్రతినిధిగా కె.దుర్గ (జెడ్పీ హైస్కూల్, తాడిపర్రు), నియోజకవర్గ స్కూల్ గేమ్స్ కో-ఆర్డినేటర్‌గా సార నరసింహులు (బాలుర ఉన్నత పాఠశాల, నిడదవోలు), స్పోర్ట్స్ కాంప్లెక్స్ కో-ఆర్డినేటర్‌గా ఎస్టీ రామారావు (జెడ్పీ హైస్కూల్, పురుషోత్తపల్లి)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని ఎంఈఓలు కేవీ గణేష్, పి.గురుమూర్తి అభినందించారు.

ఘనంగా సర్వాయి పాపన్న జయంతి



బ్రాహ్మణగూడెంలో పాపన్న జయంతి వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న అభిమానులు

చాగల్లు: 17వ శతాబ్దంలో తెలంగాణను పాలించిన సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను ఆదివారం మండలంలోని బ్రాహ్మణగూడెం, ఎస్.ముప్పవరం గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న చిత్ర పటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. బ్రాహ్మణగూడెంలో నిర్వహించిన కార్యక్రమానికి నిడదవోలు మున్సిపల్ కౌన్సిలర్ కారంకి నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సర్వాయి పాపన్న జీవితం అందరికీ ఆదర్శప్రాయం అన్నారు. బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం కోసం సర్వాయి పాపన్న పాటుపడ్డారని గుర్తు చేశారు. ఊనగట్ల సర్పంచ్ మట్టా వెంకట్రావు మాట్లాడుతూ సర్వాయి పాపన్న స్ఫూర్తి గాథలను భవిష్యత్తు తరాలకు తెలియజేయాల్సి ఉందన్నారు. అనంతరం కేక్ కట్ చేసి పంచారు.కార్యక్రమంలో వెలగన నాగరాజు, రేలంగి గోవింద్, చేబ్రోలు దుర్గాప్రసాద్, వెలగన పోసయ్య తదితరులు పాల్గొన్నారు.

పండమ్మ ఇల్లంతా పచ్చదనమే



ప్రకాశరావుపాలెంలో ముత్తిన పండమ్మ డాబాపై పెంచుతున్న వివిధ రకాల పండ్లు, పూలమొక్కలు

డాబాపై 26 రకాల పండ్లు, పూలమొక్కల సాగు

నల్లజర్ల: ఆమెకు మొక్కల పెంపకం అంటే చెప్పలేనంత ఇష్టం. కంట బడితే చాలు అది పండ్ల మొక్కైనా, పూలమొక్కైనా ఆమె ఇంట ఉండాల్సిందే. మండలంలోని ప్రకాశరావుపాలేనికి చెందిన ముత్తిన పండమ్మ తమ ఇంటి డాబాపై దాదాపు 26 రకాల పండ్లు, పూలమొక్కలు పెంచుతున్నారు. వాటి కోసం ప్రత్యేకంగా ఆమె ఐరన్ మెష్, స్టాండ్లు కూడా ఏర్పాటు చేసుకున్నారు. మరికొన్ని కూరగాయలు, పండ్ల మొక్కలను పెద్ద సైజు కుండీల్లో శ్రద్ధగా పెంచుతున్నారు. వాటికి అవసరమైన మట్టి మిశ్రమాన్ని సొంతంగా తయారు చేయిస్తున్నారు. వంగ, దొండ, చిక్కుడు, టమాటా వంటి కూరగాయలు, డ్రాగన్ ఫ్రూట్ వంటి అరుదైన పండ్ల మొక్కలు కూడా పెంచుతున్నారు. అవికూడా ఇప్పుడిప్పుడే ఫలాలు ఇచ్చే స్థితికి చేరుకున్నాయి. మొక్కలే తనకు మంచి నేస్తాలని చెప్పే పండమ్మ రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో తప్పనిసరిగా కొంత సమయాన్ని ఈ మొక్కలలో గడుపుతారు.

మొక్కలు నాటితేనే పర్యావరణానికి రక్షణ

రాజమహేంద్రవరం రూరల్: మొక్కలు నాటడంతో పర్యావరణాన్ని కాపాడవచ్చని శ్రీఅమ్మ ఒడి సేవాతరంగిని అధ్యక్షుడు విజయస్వామి అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం కోలమూరులో శ్రీఅమ్మ ఒడి సేవాతరంగిణి ఆధ్వర్యంలో 750 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విజయస్వామి మాట్లాడుతూ ఏబీవీపీలోని స్టూడెంట్ ఫర్ డెవలప్‌మెంట్ విభాగం, చేతనా ప్రకృతిసేవా సంస్థ సభ్యులు మొక్కలు నాటడంలో సహకారం అందించారన్నారు. కార్యదర్శి శివ స్వామి మాట్లాడుతూ చిరంజీవి, ఇషా ప్రథమ జన్మదినం సందర్భంగా నాయుడు గారి వంటిల్లు అధినేత రాకేష్, రమాదేవి దంపతులు ఈ కార్యక్రమానికి సహకరించారని తెలిపారు. జనసేన పార్టీ నగర ఇన్‌చార్జి అను శ్రీ సత్య నారాయణ చేతుల మీదుగా మొక్కలు నాటి,శ్రమదానం చేసిన సేవకులకు పుస్తక పంపిణీ చేశారన్నారు.

నేడు గోష్పాద క్షేత్రంలో చండీ హోమం

కొవ్వూరు: స్థానిక గోష్పాద క్షేత్రంలోని జ్ఞాన సరస్వతీ మందిరంలో సోమవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి చండీహోమం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని ఆత్మీయ హితకారిణీ సమాజం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

నేడు సుందరేశ్వరునికి సహస్ర ఘటాభిషేకం

కొవ్వూరు: స్థానిక గోష్పాద క్షేత్రంలోని సుందరేశ్వర స్వామి వారికి సోమవారం సహస్ర ఘటాభిషేకం నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా గోదావరి మాతకు మహానీరాజనం సమర్పిస్తారు. కాల భైరవ స్వామికి అష్టోత్తర పూజ, కూష్మాండ దీపం, శివాలయంలో విశేష పూజలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

కొవ్వూరు: మండలంలోని కాపవరం గ్రామంలో కూల్ డ్రింక్స్ షాపులో అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్న మెంటిమి పవన్‌కుమార్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్సై జె.ధర్మరాజు తెలిపారు. అతడి వద్ద నుంచి ఎనిమిది క్వార్టర్ మద్యం బాటిళ్లు, రెండు బీర్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

నల్లజర్ల: జాతీయ రహదారిపై మండలంలోని అనంతపల్లి గ్రామ సమీపంలో ఆదివారం రోడ్డు ప్రమాదం సంభవించింది. మోటారు సైకిల్‌ను కారు ఢీకొట్టిన ఈ ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. అనంతపల్లి ఎస్సీ కాలనీకి చెందిన పాకా రమేష్ అనే వ్యక్తి తన భార్య లావతో కలిసి మోటార్ సైకిల్‌పై వెళుతుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీ కొట్టింది.ఈ ప్రమాదంలో దంపతులిద్దరికీ తీవ్ర గాయాలపాల్యారు. ఇరువురినీ హైవే పోలీసులు అంబు లెన్స్‌లో తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు.ఈ ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.